
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 13 । ఆగస్టు । 2023



సోమశిలలో 22.06 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారానికి 22.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంది 426 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,453
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,617
నవర (8 గ్రాములు)	రూ.44,936

గరిష్టం/కనిష్టం
36.0 /28.0

వాతావరణం

వాతావరణంలో తేమ 52 శాతంగా ఉంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆకాశం ఆదివారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పటిష్టంగా మిషన్ ఇంద్ర ధనస్సు



మాట్లాడుతున్న పెంచలయ్య

మనుబోలు: చిన్నారులకు రోగ నిరోధక టీకాలను వేయడమే లక్ష్యంగా మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. మనుబోలు పీహెచ్‌సీని ఆకస్మికంగా శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా మూడు నెలల పాటు నెల్లో ఆరు రోజుల చొప్పున చిన్నారులకు టీకాలను వేయనున్నామని చెప్పారు. ఈ నెల ఏడు నుంచి 12 వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ తొమ్మిది నుంచి 14 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వెల్లడించారు. టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు సుబ్బరాజు, గేయ పూజిత, సీహెచ్‌ఓ రాజయ్య, పీహెచ్‌ఎన్ జయశీల పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌ను తప్పక వేయాలి

నెల్లూరు(పీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం 2022 - 23 సంవత్సరానికి సంబంధించి అందజేయనున్న ఉపకార వేతనాల కోసం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన పాఠశాల, కళాశాలల ఐఎన్వోలు, హెచ్‌ఓఐ అధికారులు బయోమెట్రిక్‌ను తప్పక వేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సెలవైనా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం యథావిధిగా పనిచేయనుందని తెలిపారు. ఆధార్‌కార్డుకు లింక్ చేసిన ఫోన్ నంబర్, ఎన్నెస్పీ యూజర్ ఐడీ, పాస్‌వర్డుతో అనుసంధానం చేసుకోవాలని కోరారు. వివరాలకు 89772 26128, 96765 06916 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముమ్మరంగా ఓటరు జాబితాల సర్వే

ఆత్మకూరు: పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ బీఎల్‌ఓలు తిరుగుతూ ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తూ భవిష్యత్తులో ఇక్కడికి రారని నిర్ధారించుకున్న కొన్ని ఓట్లను తెలుసుకున్నారు. మృతులకు సంబంధించిన ఓట్లు ఉంటే వాటిని తొలగించనున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా నమోదు చేసుకునే ఫారం - 6ను అందజేశారు.

ఊరొకటి.. పేరొకటి

కొండాపురం.. మండల కేంద్రమేనైనా ఆ పేరుతో ఎలాంటి గ్రామం కనిపించదు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, ఇది వాస్తవం. రెవెన్యూ రికార్డులు.. ప్రభుత్వపరంగా ఏ శాఖలోనూ ఈ పేరు ఎక్కడా కనిపించదు. అసలు ఈ నామం ఎలా వచ్చిందనే అంశంపై గ్రామస్తులకు సైతం స్పష్టత లేకపోవడం విశేషం.

కొండాపురం పేరిట గ్రామమే కానరాదు
- రికార్డుల్లోనూ ఇంతే
- వాస్తవానికి మండల కేంద్రం
- గుడవళ్లూరునే కొండాపురంగా సంబోధిస్తున్న వైనం



గుడవళ్లూరు (కొండాపురం) గ్రామ వ్యూ

సండే స్పెషల్

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండల కేంద్రం. కానీ ఈ పేరుతో ఎలాంటి గ్రామమే లేదు. వాస్తవానికి గుడవళ్లూరు, బోయిళ్లవారిపాళెం.. ఈ రెండు మజరా గ్రామాలను కలిపి గుడవళ్లూరు మేజర్ పంచాయతీ అంటారు. నిజానికి ఈ పంచాయతీ సుమారు 200 ఏళ్ల క్రితం ఏర్పడింది. ఈ గ్రామంలో సుమారు 800 వరకు ఇళ్లు.. దాదాపు మూడు వేల మంది ప్రజలు ఉన్నారు. సుమారు 2450 మంది ఓటర్లు.. ఈ రెండు గ్రామాలకు సంబంధించి 750 రేషన్ కార్డులున్నాయి. అయితే కొన్ని రేషన్ కార్డులపై గుడవళ్లూరు.. మరికొన్నింటిపై బోయిళ్లవారిపాళెం అని ఉంటాయే తప్ప కొండాపురం అని కనిపించదు. మండలం మాత్రం కొండాపురం అనే వస్తుంది. ఈ పంచాయతీ మొత్తాన్ని కలిపి కొండాపురం అని మండల వాసులు పిలుస్తుంటారు.

రికార్డుల్లో సైతం లేని ప్రస్తావన

పాఠశాల, గ్రామ సచివాలయాలు, పంచాయితీ కార్యాలయాలపై గుడవళ్లూరు, బోయిళ్లవారిపాళెం, కొండాపురం మండలం అని ఉంటుంది. కొండాపురం అనే ప్రస్తావన రికార్డుల్లో ఉండదు. విద్యార్థులకు అందించే ధ్రువీకరణ పత్రాలు.. జనన, మరణ పత్రాలపై సైతం కొండాపురం అని రాదు. 1బీ, అడంగళ్లలో సైతం ఇదే పరిస్థితి. సర్పంచ్ ఎన్నిక సమయంలోనూ గుడవళ్లూరు పేరుపైనే నామినేషన్లు దాఖలవుతాయి.

ఇప్పటికీ ఆశ్చర్యమే..!

వింజమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొండాపురం వాసులు భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా, ముందు గుడవళ్లూరు పంచాయతీ అనే వస్తుంది. కావలి నుంచి వచ్చే బస్సులపై మాత్రం కొండాపురం అని ఉంటుంది. తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, ఎంఈఓ, తదితర కార్యాలయాలపై కొండాపురం మండలం అని ఉండి.. రికార్డుల్లో లేకపోవడంపై మండల వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ రికార్డుల్లో గుడవళ్లూరే



ప్రభుత్వం మాకు అందించే ప్రతి రికార్డుల్లో గుడవళ్లూరు, కొండాపురం మండలం అని వస్తుంది. అయితే కొండాపురం గ్రామం మా మండలంలో ఎక్కడా లేదు. ఆ పేరెలా వచ్చిందో పూర్తిస్థాయిలో నాకు తెలియదు.

– చిమ్మిలి రామ్మూర్తి, గుడవళ్లూరు

ఇప్పటికీ గుడవళ్లూరు పంచాయతీయే



గుడవళ్లూరు పంచాయతీలో బోయిళ్లవారిపాళెం మజరా ఉంది. ఈ రెండు గ్రామాలను కలిపి గూడవళ్లూరు పంచాయతీ అని అంటారు. ఈ రెండు గ్రామాలను కలిపి కొండాపురంగా పిలుస్తున్నారు. ప్రతి రికార్డులో ఈ గ్రామాల పేర్లు వచ్చి, ఆ తర్వాతే కొండాపురం అని వస్తుంది. మండల కేంద్రానికి కొండాపురం అనే పేరెలా వచ్చిందో మా పెద్దలకూ తెలియకపోవచ్చు.

– మాల్యాద్రి, బోయిళ్లవారిపాళెం

ప్రభుత్వ రికార్డుల్లో కొండాపురం అని లేదు



మండలంలో మొత్తం 26 రెవెన్యూ గ్రామాలున్నాయి. అయితే ఈ గ్రామాల్లో కొండాపురం అనే పేరు ఎక్కడా లేదు. రెవెన్యూ రికార్డుల్లోనూ గుడవళ్లూరు రెవెన్యూ విలేజ్ అనే వస్తుంది. కొండాపురం అనే పేరెలా వచ్చిందో తెలియదు. గ్రామపెద్దలను రెండు, మూడుసార్లు అడిగినా సమాధానం చెప్పలేకపోయారు.

– హుస్సేన్, తహసీల్దార్

పేరెలా వచ్చిందో అంతుచిక్కని ప్రశ్న

కొండాపురం అనే పేరెలా వచ్చిందో ఇప్పటికీ మండల వాసులకు స్పష్టత లేకపోవడం విశేషం. ఈ విషయమై కొంత మంది పెద్దలను ప్రశ్నించగా, ఆశ్చర్యకరమైన సమాధానమిచ్చారు. కొండాపురంగా పిలుస్తున్న గ్రామం కొండ ప్రాంతమని.. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వారిని ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నిస్తే.. కొండ ప్రాంతానికి వెళ్తున్నామని చెప్పేవారట. కాలక్రమేణా అది కొండ ప్రాంతంగా మారిందని.. ఆ తర్వాత కొండాపురంగా పిలుస్తున్నారని భావిస్తున్నామని తెలిపారు.



సచివాలయంపై గుడవళ్లూరు అనే పేరుతో దర్శనమిస్తున్న పెయింటింగ్



పోటీలను ప్రారంభిస్తున్న సుప్రజ

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడతాయని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. పట్టణంలోని డీఎల్‌ఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలను అట్టహాసంగా శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని 14 జిల్లాల నుంచి బాలుర జట్లు, 11 జిల్లాల నుంచి బాలికల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. అనంతరం పలు జిల్లాల క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. షూటింగ్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు భీమతాటి రమణయ్య, నిర్వహణాధ్యక్షుడు మోర్ల భరత్, కోశాధికారి విజయ్‌కుమార్, కౌన్సిలర్లు షకీలాబేగం, జయంతి, అనంతమ్మ, శ్రీదేవి, యానాదిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జట్లు

కేసుల్లో పురోగతి సాధించాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): దర్యాప్తులో నైపుణ్యాన్ని పెంపొందించుకొని కేసుల్లో పురోగతిని సాధించడంతో పాటు రెవెన్యూ, న్యాయ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పెండింగ్ ఫిర్యాదులు, తీవ్రమైన నేరాలు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, ఎస్పీడబ్ల్యూ, రోడ్డు ప్రమాదాలపై సమీక్షించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విచారణాధికారి, కోర్టు కానిస్టేబుల్ తమ కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వర్తించినప్పుడే నేరస్తులకు కచ్చితమైన శిక్ష పడుతుందని తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎస్పీడబ్ల్యూను అమలు చేయాలని తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులతో పాటు సేవించే వారిపై సైతం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పదేపదే నేరాలకు పాల్పడే వారి జాబితాను పంపితే పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామని వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను ముమ్మరం చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై అపరాధ రుసుమును విధించాలని సూచించారు. సైబర్ మోసాలు, దిశ, ఎల్‌హెచ్‌ఎమ్మెస్ యాప్‌లపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం గత నెల్లో కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

మేమేమి చేశాము పాపం?

బుడిబుడి అడుగులు వేస్తూ.. కేరింతలు కొడుతూ.. అందర్నీ దాటుకుంటూ.. ఒక్కో మెట్టూ ఎక్కుతున్న కుమార్తెను చూసి ఉప్పొంగిపోయారు. ఆ గోవిందుడిని స్మరిస్తూ.. ముందు వెళ్తున్న కుమార్తెను గమనిస్తూ.. ముందుకు సాగారు. ఇంతలో బాలిక హఠాత్తుగా అదృశ్యమవ్వడంతో ఒకింత గందరగోళానికి లోనయ్యారు. ఎక్కడుందోననే ఆత్రుతతో చీకటిని చీల్చుకుంటూ వెతుకులాడడం ప్రారంభించారు. నిశీధిలో రెప్ప వాల్చకుండా ఎక్కడో ఒకచోట సురక్షితంగా ఉంటుందని ఎదురుచూశారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. క్రూరమృగాల దాడిలో చిన్నారి మృతిచెందిందని తెలిసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఈ విషాద ఘటన రుయా ఆస్పత్రి వద్ద శనివారం కనిపించింది.

- క్రూరమృగాల దాడిలో బాలిక మృతి
- తిరుమల అలిపిరి నడక మార్గంలో ఘటన
- తల్లిదండ్రుల రోదనలతో దద్దరిల్లిన రుయా
- టీటీడీ అధికారుల అత్యవసర సమావేశం
- నడక మార్గంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు
- దాడి చేసింది చిరుతా..ఎలుగుబంటా?





రోదిస్తున్న కుటుంబ సభ్యులు. నడక మార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో లక్షిత మృతదేహం



శోక సంద్రంలో తండ్రి దినేష్‌కుమార్

సాక్షి, తిరుపతి/తిరుపతి తుడా: తిరుమల అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి ఘోరం చోటుచేసుకుంది. వన్యమృగం దాడిలో ఆరేళ్ల బాలిక మృతిచెందడం అందరినీ కలిచివేసింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పోతిరెడ్డిపాళేనికి చెందిన దినేష్‌కుమార్, శశికళ కుమార్తె లక్షిత(6) శుక్రవారం సాయంత్రం అలిపిరి కాలిబాటలో కనిపించకుండా పోయింది. నడకదారిలో చిన్నారి కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, ఫారెస్ట్ సిబ్బంది జల్లెడ పట్టారు. శనివారం తెల్లవారు జాము నుంచి మరోమారు గాలింపు చేపట్టగా.. అలిపిరి నడకమార్గంలోని నరసింహస్వామి ఆలయానికి వంద నుంచి 200 మీటర్ల దూరంలో ఓ బండరాయిపై లక్షిత మృతదేహం లభ్యమైంది.

క్రూరం..ఘోరం

చిన్నారి లక్షితను వన్యమృగాలు అతి కిరాతకంగా హతమార్చినట్టు తెలుస్తోంది. మెడ, తల భాగాన్ని.. కుడి కాలు తొడ భాగంలోని కండను పూర్తిగా తినేయడంతో భయానకంగా మారింది. చిన్నారి మృతదేహాన్ని ఉదయం 7.55 గంటలకు తిరుపతి రుయా ఆస్పత్రి తీసుకొచ్చారు. 15 నిమిషాల పాటు డాక్టర్లు పరిశీలించి శవపరీక్ష కోసం మార్చురీకి తరలించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగ వైద్యుల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. ఉదయం 11.05 గంటలకు పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు టీటీడీ అంబులెన్స్ సిద్ధం చేసింది.

కొంప ముంచిన బెలూన్!

సీసీ ఫుటేజ్ పరిశీలించిన అధికారులు చిన్నారి హుషారుగా.. వేగంగా ఆడుకుంటూ తల్లిదండ్రులకంటే ముందే మెట్లెక్కడం కనిపించింది. ఈ క్రమంలో ఆంజనేయస్వామి విగ్రహం తర్వాత ఓ దుకాణం వద్ద బిస్కెట్ ప్యాకెట్‌ను కొనిచ్చారు. వాటిని తింటూ చిన్నారి ముందుకు సాగింది. నరసింహస్వామి ఆలయ సమీపంలో చిన్నారి కనిపించకుండా పోయింది. బెలూన్‌తో ఆడుకుంటున్న సమయంలో గాలికి ఆ బెలూన్ మెట్లమార్గం దాటి వెళ్లడం.. దాని కోసం పరుగులు తీసే క్రమంలో ఆ పరిసర ప్రాంతాల్లో చెట్ల మాటున దాగి ఉన్న క్రూరమృగం పాపను ఎత్తుకెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న బొలెరో మినీట్రక్కు



డ్రైవర్ హరీష్ మృతదేహం



దెబ్బతిన్న బొలెరో వాహనం

• డ్రైవర్ మృతి..క్లీనర్‌కు తీవ్రగాయాలు

దుత్తలూరు: టిప్పర్‌ను బొలెరో మినీట్రక్కు ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని తెడ్డుపాడు సమీపంలో 565వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు... దుత్తలూరు వైపు నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు ఇసుక లోడుతో బయలుదేరిన టిప్పర్ డ్రైవర్ శుక్రవారం అర్ధరాత్రి తెడ్డుపాడు వద్ద వాహనాన్ని రోడ్డు మార్జిన్‌లో నిలిపి మూత్ర విసర్జనకు వెళ్లాడు. అదే సమయంలో అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి రాజమండ్రికి పూలలోడుతో వెళుతున్న బొలెరో మినీట్రక్కు అదుపుతప్పి టిప్పర్‌ను వెనుకవైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నమయ్య జిల్లా పెద్దపాణ్యం గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ కొమ్మిశెట్టి హరీష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. దుత్తలూరు ఎస్సై ప్రభాకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ మృతదేహాన్ని ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

నెల్లూరు రూరల్ : మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన నెల్లూరు రూరల్ పరిధిలోని మూడో మైలు వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. రూరల్ పరిధిలోని నవలాకులతోట ప్రాంతానికి చెందిన మచ్చలి వెంకటమునిప్రసాద్ (36) పొగతోటలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం రోజులాగే ఇంటి నుంచి మెడికల్‌షాపునకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. మూడో మైలు సమీపంలోకి రాగానే మోటార్‌సైకిల్‌ను వెనుకగా బూడిద లోడు లారీ ఢీకొంది. దీంతో వెంకటమునిప్రసాద్ లారీ టైరు కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే లారీని నిలిపివేసి డ్రైవర్ పరారయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు రూరల్ పోలీసులు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లారీ చక్రాల కింద వెంకటమునిప్రసాద్ మృతదేహం

నిమ్మధరలు

పొదలకూరు (కిలో) పెద్దవి: రూ.45
సన్నవి:రూ.20 పండ్లు: రూ. 8

చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

సంగం: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉడ్‌హౌస్‌పేటకు చెందిన దివ్యాంగుడు వెంకటాద్రి(40) నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు..ఉడ్‌హౌస్‌పేటకు చెందిన వెంకటాద్రి (40) దివ్యాంగుడు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. రాత్రి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద వాంతులు చేసుకుంటుండగా గుర్తించిన స్థానికులు నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటాద్రి శనివారం మృతి చెందాడు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15న జిల్లా ఆట్యా-పాట్యా జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఆట్యా-పాట్యా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఆట్యా-పాట్యా అసోసియేషన్ సెక్రటరీ కే కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సీబీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఎంపికైన జట్లను ఈ నెల 19, 20 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్ పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 91829 10893, 9493 582143 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.142
లేయర్	రూ.92
బ్రాయిలర్ చికెన్:	రూ.244
స్కిన్‌లెస్ చికెన్:	రూ.270
లేయర్ చికెన్:	రూ.156

ప్రజలపై కక్షతో రగిలిపోతున్న బాబు, పవన్

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజలు తమని నమ్మడం లేదనే దుగ్ధతో వారిపై కక్షతో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ రగిలిపోతున్నారని, వారిపై ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో అనేక కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేస్తున్నవి యాత్రలు కావని, రాష్ట్ర ప్రజలపై దండయాత్రలని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ప్రజలు అన్ని రకాలుగా సంతోషంగా ఉన్నారన్నారు. దీంతో ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు టీడీపీ, జనసేన పార్టీలను నమ్మడం లేదని, ఆదరించడం లేదనే స్థిరమైన అభిప్రాయానికి వచ్చిన చంద్రబాబు, పవన్ నిత్యం అల్లరి మూకలతో అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రం, రాష్ట్ర ప్రజల మేలు కోరే వారు కనీసం కలలో కూడా ఊహించని దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్న వారితో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ప్రజల్లో అభద్రతాభావం కల్పించి, రాజకీయ పబ్బం గడుపుకోవాలనే దారుణమైన భావజాలం కలిగిన వారి విషయంలో ప్రజలు విచక్షణతో ఆలోచించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కన్నా మెరుగైన పరిపాలన చేస్తానని పవన్, గతంలో తాను చేసిన పరిపాలననే మళ్లీ అందిస్తానని చంద్రబాబు ఎక్కడా చెప్పడం లేదనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను దారుణంగా దూషించడం, ప్రజలను దబాయించడం వంటి దుందుడుకు విధానాలను మాత్రమే అవలంభిస్తున్న వారికి రాష్ట్ర ప్రజల సంక్షేమంపై నిబద్ధత లేదనే విషయం తేటతెల్లమవుతోందన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఉంటే, ఆయనకు బానిసగా ఉన్న పవన్ అన్ని రకాలుగా ఆయనకు సహకరించేందుకు ఏ స్థాయికి దిగజారిపోవడానికైనా బరితెగిస్తున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, జనిగర్ల మహేంద్రయాదవ్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, వందిటి కామరాజు, కనుపర్తి రాజశేఖర్, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కాటా శ్రీనివాసులురెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్ రెడ్డి, కుందుర్తి కామయ్య, మండలి కృష్ణారావు, గుర్రం వెంకటేశ్వర్లు, అమరా వేదగిరి, తిరువీధి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

చిన్నారి కుటుంబానికి చేయూత

కోవూరు: తిరుమలలో వెంకటేశ్వరుడి దర్శనానికి కాలినడకన వెళ్తూ క్రూరమృగాల దాడిలో మృతి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.2 లక్షల సాయాన్ని ప్రకటించారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. కాగా క్రూరమృగాల దాడిలో చిన్నారి మృతి చెందడం బాధాకరమని, చిన్నారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని డీఏఏబీ చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు.

రెండో రోజూ ఘుమఘుమలు

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో సీ ఫుడ్ ఫెస్టివల్ శనివారం రెండో రోజూ కొనసాగింది. వివిధ రకాల చేపలు, రొయ్యలను ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పలువురు స్టాళ్లను సందర్శించారు. మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

• లారీని ఢీకొన్న మరో లారీ, కారు
• వృద్ధుడికి స్వల్పగాయాలు

కావలి రూరల్: మద్దూరుపాడు సమీపంలోని ఫ్లైఓవర్‌పై శుక్రవారం అర్ధరాత్రి మరమ్మతులకు గురై ఆగివున్న బొగ్గులోడు లారీని ఇసుక లారీతో పాటు కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. రూరల్ ఎస్సై సుమన్ తెలిపిన వివరాల మేరకు..కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గులోడుతో ఒంగోలు వైపు వెళ్తున్న లారీ మద్దూరుపాడు సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులకు గురైంది. దీంతో డ్రైవర్ లారీని పక్కకు నిలిపి వెనుక వస్తున్న వాహనాలకు సెల్ లైట్‌తో సిగ్నల్ ఇస్తున్నాడు. ఈ క్రమంలో క్షణాల వ్యవధిలోని అతివేగంగా వచ్చిన ఇసుక లారీ ఆగివున్న బొగ్గు లారీని ఢీకొంది. దీంతో హైవేపై బొగ్గు, ఇసుక కుప్పలు కుప్పలుగా పడింది. అదే సమయంలో బెంగుళూరు నుంచి కందుకూరుకు వెళ్తున్న కారు బొగ్గు, ఇసుక గుట్టలను ఎక్కి అదుపుతప్పి ఇసుక లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వెంకటసుబ్బారెడ్డి, భార్య అపర్ణ, కుమార్తె, కుమారులకు ఎలాంటి గాయాలు కాలేదు. తండ్రి రామలింగారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి సిబ్బందిపై చర్యలకు ఉత్తర్వులు

కొడవలూరు: ఉపాధి నిధులను పక్క దారి పట్టించిన మండల ఉపాధి సిబ్బందిపై చర్యలు చేపట్టాలని పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ సూర్యకుమారి కలెక్టర్‌కు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తలమంచిలో ఉపాధి నిధులు పక్కదారి పట్టాయని గ్రా మానికి చెందిన శివకుమార్ గతే డాది సెప్టెంబర్ 19న స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అంబుడ్స్‌మెన్ వెంకారెడ్డి విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. టీఏ వెంకటరమణయ్య రూ.5.65 లక్షలు, ఈసీ బాబు రూ.2.82 లక్షలు, సీఓ సునీల్‌కుమార్ రూ. 2.82 లక్షలు, ఫీల్డ్ అసిస్టెంట్ బ్ర హ్మయ్య రూ.14.13 లక్షలను పక్కదారి పట్టించారని నివేదికలో పేర్కొన్నారు. స్పందించిన పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ పై నలుగురిపై చర్య లు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.

క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు

ఉపాధి నిధులు పక్కదారి పట్టించిన సమయంలో ఎంపీడీఓలుగా పనిచేసిన జ్యోతి, నరసింహారావు, సుబ్రహ్మణ్యంపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేశారు.